క్లుప్తంగా

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ

కార్వేటినగరం: గ్రామదేవతగా విరాజిల్లుతున్న బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజామున పసుపు, చందనం , పాలు, పెరుగు, తేనే, నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌కు విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ భక్తుల తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.

వైభవంగా కొల్లాపురమ్మ జాతర



విశేషాలంకరణలో కొల్లాపురమ్మ

కార్వేటినగరం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న కొల్లాపురమ్మ జాతర మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మొక్కులున్న భక్తులు అమ్మవారి ఇష్ట ప్రసాదమైన ఆంబళ్లను అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, పిండి దీపాలు వెలిగించి, కర్పూర హారతులిచ్చి మొక్కులను తీర్చుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి గెరిగను ప్రత్యేక వాయిద్యాలు, బాణ సంచా పేలుళ్ల నడుమ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

నగరి: కీళపట్టు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో ఎలాంటి లోటుపాట్లు రాకూడదని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే పుత్తూరు నుంచి నగరి కీళపట్టుకు విచ్చేసిన లోకేష్ తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడాన్ని ఆమె ప్రశంసించారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు అందుకున్న విద్యార్థులతో దాతలు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రజనీ కాంత్ అనే దాత 200 మంది విద్యార్థులకు రూ.20 వేలు విలువచేసే భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన ఆయన ప్రధానోపాధ్యాయుడు వీఎస్ హరిదాస్ సమక్షంలో ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మోహన్, మురళి, శ్రీకాంత్, పొన్నప్పన్, షణ్ముగం, నాగేంద్రన్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో భాకరాపేట ముత్యాలమ్మ

భాకరాపేట: శ్రీముత్యాలమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం వేకువ జామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పూజలు ప్రారంభించారు. అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామంలోని మహిళలు భక్తితో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున గ్రామంలో బంధువులు, స్నేహితులు జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా ఆరిమాను గంగమ్మ తిరునాళ్ల



గెరిగను ఊరేగిస్తున్న యువకులు



పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మన్‌దొడ్ల గ్రామంలో ఉన్న ఆరిమాను గంగమ్మ ఆలయంలో అమ్మవారి తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి గెరిగను పుష్పాలతో అలంకరించి రెండు రోజులుగా మాంబేడు, దిగువ గెరిగదొన, కసవనూరు, గొల్లపల్లె గ్రామాల్లో ఊరేగించి ఆలయానికి చేర్చారు. మంగళవారం నడివీధి గంగమ్మకు పెద్ద ఎత్తున మహిళలు అంబలి పోసి, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. తరువాత పచ్చికాపల్లం పేట వద్ద ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. మంగళవారం రాత్రి మన్నుతో తయారు చేసిన ఆరిమాను గంగమ్మ ప్రతిమను పుష్ప పల్లకిపై వేంచేపు చేసి సుంగధభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహిళలు భక్తి ప్రపత్తులతో మంగళహారతులు, కర్పూర నీరాజనాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

జూలై 12 వరకు నేను బడికి పోతా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

నగరి: జూలై 12వ తేదీ వరకు నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహిస్తామని ఎంఈఓలు శ్రీదేవి, సమశ్శివాయం అన్నారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నమోదు విషయమై మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశం 6 నుండి 14 సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలను వంద శాతం నమోదు చేయాలన్నారు. బడికి నిలిచిపోయిన వారిని తిరిగి బడిలో చేర్పించాలని, ఈ అంశంపై జిల్లా, మండలస్థాయి, పాఠశాల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కమిటీకి జిల్లా స్థాయిలో డీఈఓ, ఏపీసీ, జడ్పీ సీఈఓలు సభ్యులు గా ఉంటారన్నారు. మండల స్థాయిలో అర్బన్ అయితే మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు, హాస్టల్ వార్డెన్, సీడీపీఓలు సభ్యులుగా ఉంటారన్నారు. అలాగే పాఠశాల స్థాయిలో స్కూల్ చైర్మన్, హెచ్ఎంలు, సీఆర్పీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు మెంబర్లుగా ఉంటారన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ, తహశీల్దార్, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న ఎంపీడీఓ

'నేను బడికి పోతా'ను విజయవంతం చేయండి

నింద్ర: ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవాని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13 నుండి జులై 12వ తేదీ వరకు వరకు 6 నుండి 14 సంవత్సరాల వరకు వయసు కలిగిన పిల్లలు బడిలో చేర్పించాలని అన్నారు. ప్రతిగ్రామంలో తిరిగి నమోదు చేయాలని అన్నారు. అదే విధంగా బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. ఈ సమావేశంలో విద్యాధికారులు వసుమతిదేవి, శ్రీధర్‌రాజు, డీటీ మాధవీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ మంగళవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మైమరిపించిన మరువాడ గానామృతం

తిరుపతి కల్చరల్: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో మంగళవారం సాయంత్రం అమెరికాకు చెందిన మరువాడ భీమశంకర్ సంగీత గానామృతం శ్రోతలను మైమరిపించింది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో సంగీతాన్ని అభ్యసించిన భీమశంకర్ అమెరికాలో ఉద్యోగం చేస్తూ సంగీత వ్యాప్తికి విశేష కృషి చేస్తున్నారు. ఈయన సంగీతానికి సంబంధించి అనేక వ్యాసాలు, విశ్లేషణాత్మక సదస్సులు నిర్వహించారు. ఇటీవల ఆయన హంసధ్వని పేరిట ప్రత్యేక పుస్తకాన్ని కూడా రాశారు.

వృద్ధులకు చీరలు, పంచెల వితరణ



వృద్ధులకు చీరలు, పంచెలు అందజేస్తున్న దాతలు

కార్వేటినగరం: మండల కేంద్రంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతలు మంగళవారం చీరలు, పంచెలు వితరణ చేశారు. కార్వేటినగరం బ్రాహ్మణ వీధికి చెందిన నీరజ కుమార్తె వి.కిమయ, హేమంత్, శైలజ దంపతుల కుమార్తె వి.కనిష్కల జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టి, పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అలాగే పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పీడీ గంగాధరం, శ్యామ్‌చరణ్, స్పందన, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చల్లంగ చూడు గంగమ్మా..



వేయికళ్ల దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) నెమలి పింఛంతో విశేష అలంకరణలో గంగమ్మతల్లి

- గంగమ్మకు భక్తుల మరుపొంగళ్లతో మొక్కులు
- ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దర్శనం

తిరుపతి కల్చరల్: చల్లంగా చూడు గంగమ్మ తల్లీ... అంటూ భక్తజనం మంగళవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి ప్రణమిల్లి వేడుకున్నారు. తిరుపతి గంగ జాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్ల మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగ జాతర తర్వాత వచ్చిన నాలుగో మంగళవారం కావడంతో అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ ఆలయంలో వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. పొంగళ్లు నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం నెమలి పింఛంతో సర్వాంగ సుందర అలంకరణలో గంగమ్మ తల్లిని కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతర మొక్కుబడి వేషాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మరి కొందరు భక్తులు వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పోసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయానికి విచ్చేసి భక్తులకు ఆలయ ఈఓ కె.మమత అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయించి ప్రసాదాలు వితరణ చేశారు. మేయర్ డాక్టర్ శిరీష గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ డాక్టర్ శిరీష

బాధితులకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుంది



నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నేత వై.కుమారస్వామిరెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు పట్టణానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు మోహన్‌రెడ్డి తల్లి అమరావతి మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న కుమారస్వామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి అమరావతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి ఆర్కే రోజా మోహన్‌రెడ్డిని ఫోన్ ద్వారా పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉత్తమ విద్య



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పాలసముద్రం: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉత్తమ విద్య ప్రభుత్వ కళాశాల్లోనే అందుతుందని, మీ పిల్లలను ప్రభుత్వ కాలేజీల్లోనే చేర్పించాలని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రన్సిపల్ హేమలత పిలుపునిచ్చారు. మంగళవారం అధ్యాపకులు రెండు గ్రూప్‌లుగా విడిపోయి పాలసముద్రం, సీఎం కండ్రిగ, సిం హరాజుపురంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలల్లో అందుతున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అనుభవం , అర్హత, ఉత్తమ అధ్యాపకులు ఉంటారన్నారు. అడ్మిషన్ ఫీజు తప్ప ఇతర ఫీజులు చెల్లించాల్సిన పనిలేదన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అధ్యాపకులు వినాయకం, సుశీల, రేవతిబాయి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు కళాశాలలో చేర్పించి, కష్టపడి పని చేసి సంపాదించిన డబ్బులను వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ కళాశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు.

ఘనంగా తయ్యూరు గంగమ్మ జాతర



విశేషాలంకరణలో అమ్మవారు

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు గ్రామంలో గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. జాతరకు జనం పోటెత్తారు. అమ్మవారికి అంబలి, పిండి వంటలు, నైవేద్యం సమర్పించారు. భక్తులు వివిధ వేషధారణలు వేసి, మొక్కులు తీర్చుకున్నారు. తొలుత డప్పు వాయిద్యాలు నడుమ గంగమ్మను నడివీధిలో కొలువుదీర్చారు. అనంతరం భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఆలయ ధర్మకర్త తిరుమల, ఉమాపతి చేతులు మీదుగా తొలి పూజ చేసి, జాతర ఘట్టాన్ని ప్రారంభించారు. అనంతరం నిత్యకైంకర్యాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. ఈ కార్యక్రమాలకు చిరంజీవి, ప్రభాకర్, సుధాకర్, గోవింద్‌రెడ్డి, చిన్నబ్బ, నవీన్ తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శ్రీకృష్ణస్వామి కల్యాణం కమనీయం

పుత్తూరు: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో మంగళవారం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. అనంతరం పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి వధూవరులుగా తీర్చిదిద్దారు. తొలుత కలశ ప్రతిష్ట చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్త సమూహం మధ్యన వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు మేళతాళాలు, బాణసంచా నడుమ బ్రహ్మాండ నాయకుని గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తులు

ఆద్యంతం ఆధ్యాత్మికం





హరికథ గానం చేస్తున్న ప్రముఖ భాగవత కళాకారులు

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రంలోని ఆడిటోరియంలో మంగళవారం ప్రముఖ భాగవత కళాకారులు ప్రదర్శించిన హరికథా గానామృతం ఆద్యంతం ఆధ్యాత్మికతతో ప్రేక్షకుల హృదయాలను పులకింపజేసింది. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో చేపడుతున్న నిరంతరాయ సప్తగిరి సంగీత సప్తాహం మంగళవారంతో మూడో రోజుకు చేరుకుంది. సప్తగిరి సంగీత సప్తాహంలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ భాగవత హరికథా కళాకారులు రామాయణ, భారత ఇతిహాసాలలోని పలు ఘట్టాలను చక్కటి అభినయంతో గానం చేసి శ్రోతలను మైమరిపించారు. ఉదయం 9 గంటలకు హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాస విరచిత కీర్తనలు గోష్టి గానం చేశారు. అనంతరం హరికథా కళాకారులు మందూరి లక్ష్మీకుమారి శ్రీనివాస చరిత్ర, లక్ష్మీరాజ్యం బృందం జానకీ శపథం, యండమూరి శిఖామణి భక్త ప్రహ్లాద, తాడేపల్లె గూడెంకు చెందిన కావూరి శారద సీతాకల్యాణం వంటి అద్భుత ఘట్టాలను సందర్భానుచితంగా రాగయుక్తంగా హరికథా గానం చేసి సభికులను ఆకట్టుకున్నారు. వీరితో పాటు గుంటూరుకు చెందిన ధూళిపాళ్ల శివరామకృష్ణ శర్మ, గుంటూరుకు చెందిన వెంకట సింహాచల శాస్త్రి, హైదరాబాద్‌కు చెందిన శ్రీరాం భట్టర్, తెనాలికి చెందిన గాలి శివ పార్వతి తదితర 20 మంది హరికథా కళాకారులు ఇతిహాస పురాణాలలోని వైవిధ్య భరితమైన ఘట్టాలను వినసొంపుగా గానం చేశారు. మూడో రోజు హరికథ గానం చేసిన కళాకారుల బృందాలను నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గంగులప్ప శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. సప్తగిరి సంగీత సప్తాహంలో భాగంగా నాలుగో రోజైన బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రముఖ సంగీత విద్వాంసులతో దాస సాహిత్య స్వర ధార కార్యక్రమం నిర్వహించారు.





సంగీత సప్తాహంలో హరి కథా గానం